# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 తేది. 21-06-2015

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు దేశ వ్యాప్తంగా మంచి పేరు వస్తున్నదని, అధికారులు అంకిత భావంతో పనిచేయడం వల్లనే ఇది సాధ్యమవుతున్నదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డిలో ఆదివారం కలెక్టర్లు, ఎస్పీలు, డిఎఫ్ఓలు, హౌసింగ్ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. మంత్రులు జోగురామన్న, ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపి కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, డిజిపి అనురాగ్ శర్మ, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసిఆర్ మాట్లాడారు.

"రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు దేశం దృష్టిని ఆకర్శించాయి. హడ్కో లాంటి సంస్థలు ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు వచ్చాయి. డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టుకు, నూతన పారిశ్రామిక విధానానికి మంచి ఆదరణ లభించింది. చాలా మంది కేంద్ర మంత్రులు, నాయకులు నాతో మాట్లాడినప్పుడు మన పథకాల గురించి ప్రస్తావించి, ప్రశంసించారు. ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలకు మంచి పేరు వచ్చింది. మంచి ఉద్దేశ్యంతో చేసే పనులకు భగవంతుడి ఆశీర్వాదం కూడా ఉంటుంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి మూడు స్థానాల్లో ఉంటుందన్నారు".

కలెక్టర్లు, ఎస్పీల సమావేశం మొదటి సెషన్ లో తెలంగాణకు హరిత హారం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సమీక్షించారు. అటవీ శాఖ సిసిఎఫ్ మిశ్రా, వివిధ జిల్లాల కలెక్టర్లు వచ్చే నెలలో నిర్వహించే హరిత హారం కార్యక్రమం ఏర్పాట్లను వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా 4,213 నర్సరీల్లో 40 కోట్ల మొక్కలు నాటడానికి సిద్దంగా ఉన్నాయన్నారు. పండ్ల చెట్లు, నీడ చెట్లు, ఔషధ చెట్లు, ఆలంకరణ చెట్లు, భూమికి బలాన్నిచ్చే చెట్లు, అందంగా కనిపించే చెట్లు, చెరువులపై నాటడానికి ఈత చెట్లు, అటవీ ప్రాంతాల్లో పెంచే మొక్కలు, ఇలా అన్ని రకాల మొక్కలు సిద్దంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా హరిత హారం కార్యక్రమం నిర్వహణపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

"హరిత హారం కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఓ ప్రజా ఉద్యమంలా జరగాలి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో, అన్ని ప్రాంతాల్లో 230 కోట్ల మొక్కలు నాటాలి. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చేయడానికి అవసరమైన సంరక్షణా చర్యలు తీసుకోవాలి. స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ఇతర అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను భాగస్వాములను చేయాలి. మొక్కలను సంరక్షించడానికి ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలి. ప్రాంగణాల గేట్ల వద్ద ఎనిమల్ ట్రాపర్స్ ను పెట్టాలి. హరిత హారం కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలి. పోస్టర్లు, కరపత్రాలు, ఆడియో, వీడియో పద్ధతులు, కవి సమ్మేళనాలు, అవధానాలు కూడా నిర్వహించాలి. విద్యార్థులను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలి. శ్రమధానం ద్వారా మొక్కలు నాటడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అన్ని రకాల ఉద్యోగులతో పాటు, పోలీసులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. మిషన్ కాకతీయతో పాటు అనేక ప్రజా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తెలంగాణ పోలీసులు మంచి పేరు తెచ్చుకున్నారు. హరిత హారంలో కూడా పోలీసులు స్వయంగా మొక్కలు నాటాలి. చెరువు గట్ల వద్ద సిల్వర్ ఓక్స్, ఈత చెట్లు పెంచాలి. నర్సరీల నుండి గ్రామాలకు మొక్కలు వెళ్లే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. గ్రామ స్థాయిలో ఉండే విఆర్ఓలతో పాటు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలి. మొక్కలు నాటడంతో పాటు వాటిని రక్షించి, పెంచి పెద్ద చేసే విషయంలో సమిష్టిగా కృషి చేయాలి. పాఠశాలల హెడ్ మాష్టర్లు, తహశిల్దార్లు, విఆర్ఓలు, సర్పంచ్, జడ్పిటిసి, ఎంపిటిసీలతో గ్రామ హరిత రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుత ఏడాదికి మొక్కలు నాటుతూనే, వచ్చే ఏడాదికి అవసరమయ్యే మొక్కలను కూడా ఇప్పటి నుండే సిద్ధం చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా నశించిపోయిన అడవులను మళ్లీ దట్టమైన వనాలుగా తీర్చిదిద్దడానికి అణువైన మొక్కలు నాటాలి".

"హరిత ఉద్యమం పేరుతో ముఖ్యమంత్రి నుంచి మొదలు కొని ప్రతి ఒక్కరు మొక్కలు పెట్టే కార్యక్రమంలో పాల్గొనాలి. దీనిని ఉద్యమంలాగానే భావించాలి. హెలికాప్టర్ లో కాకుండా నేను కూడా బస్సులోనే అన్ని జిల్లాలు తిరుగుతా. నియోజకవర్గాల వారిగా అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తూ కలెక్టర్లు కార్యక్రమాన్ని డిజైన్ చేయాలి. వారంలోగానే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించాలి. సాంస్కృతిక సారథి బృందాలను ప్రచారానికి వినియోగించుకోవాలి. నదీ పరీవాహక ప్రాంతాలు, నీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లు,

సింగరేణి స్థలాలు, పోలీసు బలగాలుండే ప్రాంగణాలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సబ్ స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాలు, అన్ని మతాల ప్రార్థనా స్థలాలు, రైల్వే స్థలాలు, ఇతర ఖాళీ స్థలాల్లో మొక్కలు విరివిగా నాటాలి. అగ్ని మాపక వాహనాలను పట్టణ ప్రాంతాల్లో మొక్కలకు నీరు పోయడానికి ఉపయోగించుకోవాలి. హరిత హారం పై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి వాహనంపై స్టిక్కర్లు అంటించాలి. గ్రామ పంచాయతీలు, ప్రార్థనా మందిరాల మైక్ సెట్ల ద్వారా కూడా పాటలు వినిపిస్తూ ప్రచారం చేయాలి. అర్చకులు, ఫాదర్స్, ఇమామ్ లు, గురుద్వారాల నిర్వహాకులతో సమావేశం పెట్టాలి. ఆర్టీసి బస్సుల్లో కూడా ప్రచారం చేయాలి”.

---------------------------------------------------------------------

**సిపిఆర్ఓ టు సిఎం**